# పరువు పందెంలో రాష్ట్రస్థాయిలో విద్యార్థికి ద్వితీయ స్థానం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు తేదీ 15-03-2026 నాడు జరిగాయి. ఈ పోటీలలో ఉప్పల్ వాయి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి అయిన . విశాల్ 600 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి పొందడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం శివరాం తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థికి ప్రశంసా పత్రం తో పాటు మెడల్ ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులైన సంతోష్ , రాజేందర్ , మిగతా ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కాలభైరవ స్వామి కి సింధూర పూజలు



**రామారెడ్డి (రాజముద్ర.) న్యూస్:** రామారెడ్డి మండలం ఈసనపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం రోజున ఘనంగా సింధూర పూజలు నిర్వహించారు , ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు పూజారులు నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, ఆలయ చైర్మన్ చింతల శంకర్, డైరెక్టర్లు, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ , భక్తులు పాల్గొన్నారు.

# రెండు లీటర్ల గుడుంబా పట్టివేత



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** అక్రమంగా మద్యాన్ని తయారు చేసిన,రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని నేలకొండపల్లి ఎక్సైజ్ ఎస్సై హేమలత అన్నారు.మండలంలోని రాజేశ్వరపురం,శంకర గిరి తండా,కూసుమంచి మండలంలోని బికారి తండా,మంగలితండా,పాలేరు, నాయకన్ గూడెం గ్రామాల్లో మంగళవారం ఆమె సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో రాజేశ్వరపురం గ్రామానికి చెందిన ఓ మహిళను పట్టుకుని రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా నాటు సారాయి తయారు చేసిన,విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అక్రమ అరెస్టుల నిర్బంధాలను వెంటనే ఆపాలి

**అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి**

**సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ కార్మికుల చలో అసెంబ్లీ ముట్టడి సందర్భంగా మంగళవారం వికారాబాద్ జిల్లాలో ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో అక్రమ అరెస్టులను నిర్బంధాలను తీవ్రంగా ఖండిస్తున్నమని సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ అన్నారు. అందరిని వెంటనే విడుదల చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఇచిన హామీలు వెంటనే అమలు చేయాలని, కార్మికులకు 3నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న 2 సంవత్సరాల యూనిఫామ్ సబ్బులు నూనెలు బూట్లు చెప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అందరికీ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు 8గంటల పని విధానం అమలు చెయ్యాలని తెలిపారు. ఎంపీడబ్ల్యూ మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. గ్రామపంచాయతీలో రిపేర్ లో ఉన్న వాహనాలను వెంటనే సరి చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని అధికారుల, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలన్నారు. ఈ సమస్యలు పరిస్కరెంచేవరకు ఆందోళన పోరాటాల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, సురేష్, రాములు, రామచంద్రయ్య, గోపాల్, పెంటయ్య, సంగయ్య, రాములు, కృష్ణ, రాజేంద్ర, అడివయ్య, దుర్గయ్య, అరెస్టుల ఆయా గ్రామాల గ్రామపంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

# బిసి హాస్టల్ స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలి





**గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం డిమాండ్**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** గోపినగర్ లోని శేరిలింగంపల్లి మండల బిసి బాలుర వసతి గృహం స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్, శేరిలింగంపల్లి మండల తహసిల్దార్ మహిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, రంగారెడ్డి జిల్లా బిసి డెవలప్మెంట్ అధికారి డిప్యూటీ డైరెక్టర్ కేశురాంలతో పాటు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ లకు వినతి పత్రాలు అందజేశారు. వసతి గృహం ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న ప్రహరి నిర్మాణం చేపట్టడం లేదని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహానికి రక్షణ లేకపోవడంతో ప్రాంగణం కబ్జాలకు గురవుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బాలుర వసతి గృహం స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ బస్తీల వాసులు పాల్గొన్నారు.


# జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కిట్ల పంపిణీ



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ మండల పరిధిలోని పెండ్లిమడుగు గ్రామంలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పథకం అమలు చేయబడుతున్న నేపథ్యంలో, నారాయణపూర్ గ్రామంలో రైతులకు సహజ వ్యవసాయం ప్రోత్సాహకంగా కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ సహజ వ్యవసాయం ద్వారా రసాయన రహిత పంట ఉత్పత్తి సాధ్యమవుతుందని, భూమి సారాన్ని కాపాడడంతో పాటు రైతుల వ్యయాలను తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ ఎమ్ ఎన్ ఎఫ్ పథకం ద్వారా రైతులు సంప్రదాయ పద్ధతులను అనుసరించి పర్యావరణానికి అనుకూలమైన వ్యవసాయం చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ రైతులకు అవసరమైన జీవామృతం, ఘన జీవామృతం వంటి సహజ ఇన్‌పుట్స్ తయారీపై అవగాహన కల్పిస్తూ ఈ కిట్‌లు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి సరిత మాట్లాడుతూ, రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అవలంబించి, ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత, సి ఆర్ పి జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పాస్ బుక్ తో డిసిసిబిలో లోన్..!

- సీఈఓకు ఫిర్యాదు చేసిన గోకినపల్లి రామ్మూర్తి
- భూమి లేకుండా కోట్ల రూపాయల మోసం?
- బ్యాంక్ అధికారుల పాత్రపై అనుమానాలు





**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం రూరల్ మండలంలోని డిసిసిబి బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.భూమి లేకపోయినప్పటికీ నకిలీ పట్టాదారు పాసుబుక్కులు సృష్టించి మార్ట్గేజ్ లోన్ పొందిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది.గూడూరుపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యక్తి తన భార్య పేరుమీద పిట్టలవారిగూడెం గ్రామంలోని పలు సర్వే నంబర్లలో సుమారు 3.29 ఎకరాల భూమిగా తప్పుడు రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అసలు రికార్డులు లేకపోయినా, సర్వే నెంబర్లు 71/1, 45/ ఈ, 64/ ఆ 53 / ఆ/ ఈ 59 రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ పత్రాలు సిద్ధం చేసి,వాటి ఆధారంగా బ్యాంకులో లోన్ పొందినట్లు సమాచారం.ఇందులో ప్రధానంగా బ్యాంక్ మేనేజర్, సూపర్వైజర్ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూమి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండా, నకిలీ పత్రాలపై లోన్ మంజూరు చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.ఈ వ్యవహారంపై బాధితుడు గోకినపల్లి రామ్మూర్తి డిసిసిబి సీఈఓ కు మంగళవారం ఫిర్యాదు చేశాడు.అలాగే వ్యవసాయ శాఖ ఏఈఓ నజీమా కౌశల్ అక్రమ పద్ధతిలో రైతుబంధు పొందుతున్నట్లు ఫిర్యాదు చేశాడు.బ్యాంకును తప్పుదోవ పట్టించి నకిలీ పత్రాలతో లోన్ పొందిన వారితో పాటు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

# ప్రకృతి వ్యవసాయం పై వీడియో కాన్ఫరెన్స్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కూసుమంచి మండలం కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాలేరు క్లస్టర్ లోని రైతులకు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు.మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి,రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి శరత్ బాబు,పాలేరు డివిజన్ ఉద్యాన అధికారిణి అపర్ణ,కూసుమంచి డివిజన్ టెక్నికల్ ఏవో అరుణ ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు ఘ న జీవామ ృత ం, ద్రవ జీవామ ృత ం, నీమాస్త్రం,దశపర్ణిక వంటి కషాయాలను ఎలా తయారు చేయాలో వివరించారు.అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయం కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ బాబా, ప్రియాంక , రైతులు, త దిత రులు పాల్గొన్నారు.

# పూలపల్లి గ్రామానికి కమాన్ ఏర్పాటు కృషి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల పరిధిలోని పూలపల్లి గ్రామానికి కమాన్ నిర్మాణం చేయిస్తానని పులపల్లి గ్రామ ప్రజలకు బాలాజీ రెడ్డి తెలపడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. పూలపల్లి గ్రామస్తుల కోరిక మేరకు వికారాబాద్ నుండి హైదరాబాద్ వెళ్లే మెయిన్ రోడ్ దగ్గర పెట్రోల్ పంప్ ఎదురుగా నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ రెడ్డిని గ్రామం తరపున గ్రామ సర్పంచ్ ఎలిమెల భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి శాలువాతో సన్మానం చేయడం జరిగింది.

# పశువులకు గాలి కుంటు టీకాలు వేయించాలి





**జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ బి.పురంధర్**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** పశు పోషకులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కూసుమంచి పశువైద్యాధికారి డాక్టర్ రచ్చా నీలకాంత్ అన్నారు.కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామంలో మంగళవారం గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలి కుంటు వ్యాధి సోకితే ఉత్పాదక శక్తి,పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందని తెలిపారు.పశు పోషకులు తమ పశువులను ఇంటి దగ్గరే ఉంచి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని తెలిపారు.ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ బి.పురంధర్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి,మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి పశు సంపద,పశువుల ఆరోగ్యం అత్యంత కీలకమని,పశువులకు టీకాలు వేయించడం ద్వారా వ్యాధులను ముందుగానే నివారించి,పశు సంపదను కాపాడుకోవచ్చని పురంధర్ తెలిపారు.64 మంది పాడి రైతులకు సంబంధించిన 29 తెల్ల పశువులకు,558 నల్ల పశువులకు గాలి కుంటు టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడేపల్లి విజయ, ఉప సర్పంచ్ శీలం జానయ్య,జేవిఓ స్వరూప,ఎల్ఎస్ఏలు పి.శ్రీనివాసరావు,ఎండి హమీద్ పాషా, ఓఎస్ మాధవ్,గోపాలమిత్రులు లక్ష్మారెడ్డి,భాస్కర్ రెడ్డి,గోపి తదితరులు పాల్గొన్నారు.

# నవాబుపేట్ మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం





**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా పరిధిలోని నవాబుపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపుకు ముఖ్య అతిథిగా వికారాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారి స్వర్ణకుమారి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో మొత్తం 310 మంది పేషెంట్లు వచ్చినట్లు వైద్య అధికారి తెలిపారు. గర్భిణీ స్త్రీలు 67, జనరల్ ఓపి 130, పీడియాట్రిక్ 25, కంటికి సంబంధించి 45, ఎముకలకు సంబంధించి 55, రక్త పరీక్షలకు 45 మంది రావడం జరిగింది. వైద్య పరీక్షలు చేసిన వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని నవాబుపేట్ మండల ఎంపీడీఓ అనురాధ లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆమెతోపాటు గ్రామ సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి నవనీత పాల్గొన్నారు.

## గనులపై నల్ల బ్యాడ్జిలతో ఏఐటీయూసీ ఆందోళన..




**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సింగరేణి యాజ మాన్యం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ ఆందోళన చేపట్టింది. మందమర్రి ఏరియా గనులపై నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించి ఆయా గనుల్లో అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. శాంతిఖనీ, కాసిపేట 1, కాసిపేట 2 గనుల్లో మంగళవారం జరిగిన ఆందోళనలో ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి, సీనియర్ నేత చిప్ప నర్సయ్య పాల్గొని మాట్లాడుతూ సంస్థ ఆర్థిక అభివృద్ధి బొగ్గు ఉత్పత్తి నైనీ బ్లాక్ లో ఉన్న గ్రౌండ్ స్టాక్ సుమారు 70,000 టన్నుల బొగ్గు రవాణా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 51 వేల కోట్లు టీజీ జెన్కో, టీజీ ట్రాన్స్కో నుంచి సంస్థకు రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయాలనీ డిమాండ్ చేశారు. కొత్త బొగ్గు బ్లాక్ లు చాలా కాలంగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కాకపోవడం వల్ల సంస్థ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని, బొగ్గు బ్లాకుల బిడ్డింగ్ లో పాల్గొని పీకే ఏసీ-2 డిప్ సైడ్ బ్లాక్, తాడిచెర్ల కోల్ బ్లాక్-2, కోయగూడెం ఓసీ-3, సత్తుపల్లి - 3, శ్రావణపల్లి ఓసీలను గతంలో ప్రతిపాదించినట్లుగా సింగరేణికే కేటాయించేలా బిడ్డింగ్ లో పాల్గొనా లన్నారు. గతంలో ఉన్న మైన్స్ ఎక్స్ టెన్షన్ కు ప్రతిపాదించిన ప్రాజెక్ట్స్ మణుగూరు ఓపెన్ కాస్ట్, జేకే-5 ఎక్స్ టెన్షన్ (రాంపేడు), పీవీఎన్ఆర్ ఓసీ, కేటీకే ఓసీ 2 పంచ్ ఎంట్రీ, ఆర్కే ఓసీ, గోలేటి ఓసీ, మాదారం ఓసీలతో సొంత బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. బెల్లంపల్లిలోని శాంతిఖని మైన్ లో కాంట్రాక్టర్ వదిలి వెళ్ళిపోవడంతో ఉత్పత్తి రావడం లేదన్నారు. ఉత్పత్తి వచ్చే విధంగా సంస్థ నడిపించేందుకు చర్యలు తీసుకోవాలనీ కోరారు. అన్ని ఓపెన్ కాస్ట్ గనులలో సింగరేణి పెర్మనెంట్ కార్మికుల ద్వారానే ఉత్పత్తి జరపాలని, ఓపెన్ కాస్ట్ గనుల కోసం కొత్త హెచ్ ఈ ఎంఎం, అండర్ గ్రౌండ్ గనుల కోసం ఎల్హెచ్డీ, ఎస్డీఎల్, భద్రత ఐటంలు, ఉత్పత్తి పరికరాలను వెంటనే సమకూర్చి రక్షణ ఉత్పత్తి ఉత్పాదకతను పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలి కోరారు. 2025 నుంచి ఇప్పటి వరకు జరిగిన మెడికల్ బోర్డులను సమీక్షించి, అప్లై చేసుకున్న వారిని అన్ ఫిట్ చేసి కారుణ్య నియామకాలు ఇచ్చి సహకరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి ఉద్యోగు లందరికీ "ఓన్ హౌస్ స్కీమ్" అమలు చేయాలనీ, దీని కోసం వేసిన కమిటీ లో యూనియన్ ప్రతినిధులను కూడా కమిటీ సభ్యులుగా నియమించి సొంత ఇంటికోసం తక్షణమే నిర్ణయం తీసుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. సాధారణ కార్మికుల పెర్క్స్ ఆదాయపు పన్నును రీఫండ్ చేయాలని, కార్మికులను ప్రోత్సహిం చడానికి ఉత్పత్తి ఆధారిత ఇన్సెంటివ్ స్కీము తీసుకురావాలనీ కోరారు. కార్మికుడు సహజ మరణం పొందితే ఇచ్చే పరిహారాన్ని రూ. 25 లక్షలకు పెంచాలని, సర్వీస్ క్రమశిక్షణ అంశాలు కొత్తగా తెచ్చిన ఎన్ సీ డబ్ల్యూ ఏ బదిలీ పాలసీ సర్క్యులర్ ను రద్దు చేయాలనీ కోరారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, పిట్ కమిటీ ఉపాధ్యక్షులు కొండపల్లి నరసయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బొద్దుల వెంకటేష్,శాంతిఖని ఫిట్ కమిటీ సెక్రెటరీ తిరుపతి, అసిస్టెంట్ సెక్రెటరీ మంథని రమేశ్, రత్నం రాయలింగు, ప్రవీణ్ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకరమైన సమాజం



- రైతులకు అండగా ప్రభుత్వం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 15 రైతు వేదికల్లో శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం జాతీయ మిషన్ ఫర్ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. సహజ సిద్ధమైన పద్ధతుల్లో సాగు చేయడం వల్ల ఆరోగ్యకరమైన దిగుబడి సాధించవచ్చని, రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. హాజీపూర్ మండలం గుడిపేట రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 15 రైతు వేదికల్లో 1,875 మంది రైతులతో ఈ సమావేశం నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, ఆత్మ చైర్మన్ మురళీ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఆశా వర్కర్ల ధర్నా




**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళ వారం కలెక్టరేట్ ముందు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ( సీఐటీయు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ సమ్మక్క తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం చెల్లిస్తామని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ తో జరిపిన చర్చల్లో రూ. 50 లక్షల ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం, మట్టి ఖర్చులకు రూ. 50 వేలు చెల్లిస్తామని ఇచ్చిన హామీలు రెండు ఏండ్లు గడిచినా అమలు చేయడం లేదన్నారు. పెండింగ్ లో ఉన్న జీతాలు, లెప్రసీ, ఎండిఏ డబ్బులు చెల్లించాలని, ఏఎన్సి టార్గెట్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అనితకు వివిధ డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభ, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లపై సివిల్ సప్లై దాడులు.. గృహ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** ఇరాన్–అమెరికా–ఇజ్రాయిల్ ఉద్రిక్తతల నేపథ్యంలో వంట గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టిన సివిల్ సప్లై అధికారులు అక్రమ వినియోగంపై కఠిన చర్యలకు దిగారు. మండలంలోని కేశవపట్నం ప్రధాన రహదారిపై ఉన్న పలు హోటళ్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం 25 హోటళ్లలో దాడులు జరిపి గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో ఐదు హోటళ్ల యజమానుల వద్ద ఉన్న 11 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గృహ అవసరాల కోసం ఇచ్చే సబ్సిడీ గ్యాస్ను వ్యాపార అవసరాలకు వాడడం చట్టవిరుద్ధమని, ఇటువంటి చర్యలు కొనసాగితే కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లై డిటి కాజా మొయినుద్దీన్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అన్వర్ ఉల్లా ఖాన్ హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## బాధితురాలికి మొబైల్ ఫోన్ అప్పగింత

- సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తింపు
- ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలి: కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి




**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** మిస్సింగ్ మొబైల్ ఫోన్లను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ (CEIR) పోర్టల్ ద్వారా ఒక మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు కేశవపట్నం ఎస్సై తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫోన్ యజమానికి దానిని అందజేశారు. శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన వీరబోయిన గంగమ్మ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్లో అప్లోడ్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆ ఫోన్ ఎక్కడ ఉందో గుర్తించిన పోలీసులు, దానిని స్వాధీనం చేసుకుని బాధితురాలికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సీఈఐఆర్ పోర్టల్లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా మొబైల్ ఇతరులు వాడకుండా బ్లాక్ చేయవచ్చని, అలాగే పోలీసులకు అది దొరికినప్పుడు తిరిగి యజమానికి అప్పగించడం సులభతరమవుతుందని ఆయన వివరించారు.

## అనారోగ్యంతో ఉన్న ఫోటోగ్రాఫర్‌కు రూ. 21 వేల ఆర్థిక సాయం



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** అనారోగ్యంతో బాధపడుతున్న తోటి సభ్యుడిని ఆదుకునేందుకు శంకరపట్నం మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ సభ్యులు ముందుకొచ్చారు. యూనియన్ సభ్యుడైన ఎండి అజీమ్ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న తోటి సభ్యులు, తమ వంతు సహాయంగా సేకరించిన రూ. 21,000 నగదును మంగళవారం బాధితుడికి అందజేశారు. కష్టకాలంలో తోటి వృత్తి కళాకారుడికి అండగా నిలవాలనే ఉద్దేశంతో యూనియన్ సభ్యులందరూ స్వచ్ఛందంగా ఈ విరాళాన్ని సేకరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. వృత్తిపరంగానే కాకుండా ఆపదలో ఉన్న తమ సభ్యులను ఆదుకోవడంలో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. మంచి మనసుతో స్పందించి విరాళం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, కరీంనగర్ టౌన్ ప్రధాన కార్యదర్శి సాయిప్రీతి రమేష్, మండల అధ్యక్షులు చౌడమల్ల సంపత్, ప్రధాన కార్యదర్శి బొంగోని కుమార్, కోశాధికారి మొల్గూరి రమేష్ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యక్షులు ఎస్డీ గోరేమియా, మనోచారి, సభ్యులు పాండ్రాల శ్రీనివాస్, వంగ శ్రీనివాస్, బొజ్జ చంద్రమౌళి, సుద్దాల కుమార్, జినుక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలుపై బీజేపీ నిరసన



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం :** కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు శంకరపట్నం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2500 రూపాయలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, చదువుకునే యువతులకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. పంటలు పొట్టదశకు చేరుకున్నా రైతు భరోసా అందించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు సమిరెడ్డి, నాయకులు దొంగల రాములు, కొయ్యడ కుమార్, దాసారపు నరేందర్, మందాడి జగ్గారెడ్డి, రాసమల్ల శ్రీనివాస్, సుధగోని శ్రీనివాస్, రాజిరెడ్డి వీరార్జున్, బిజిలి సారయ్య, అంతం రాజిరెడ్డి, గౌరవేణి శ్రీనివాస్, పోతునూరి రాజు, వెంగళ ప్రవీణ్, పంజాల అనిల్, బోడ తిరుపతిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

